# స్వాతిజల్లు



- దేవమల(కావ) సరోజారాణి

జయలక్ష్మి మా పక్కింటి పార్వతమ్మగారమ్మాయి. పద్దెనిమిదేళ్లుంటాయి. చిదిమి దీపం పెట్టగల రూపమా పిల్లది. చిన్నప్పట్నుంచీ నా కళ్లముందే పెరిగింది. తెల్లగా, సన్నగా, తీటకాడలా ఎదిగిన జయని చూస్తే నాకే ఒక్కోసారి ఆశ్చర్యమనిపిస్తుంది. 'ఔరా! ఈ ఆడపిల్లలు యింతలో ఎంతగా పెరిగిపోతారు' అనుకుంటాను.

మా యింట్లో ఆ పిల్లకి చనువు ఎక్కువే. మా ఆవిడని పిన్నీ అని, నన్ను బాబాయి అని పిలుస్తూ, మా చిన్నవాళ్లిద్దరికీ తానే అక్కగా అజమాయిషీ చలాయిస్తూ వుంటుంది. మా కిరణ్‌కి, విజయ్‌కి జయంటే చాలా యిష్టం.

పాపం పార్వతమ్మ భర్త ఏదో జబ్బుచేసి, అకస్మాత్తుగా పోయాడు. అప్పటికి అతనేదో పెద్ద కంపెనీలో చిన్న గుమాస్తాగా పనిచేసేవాడు. భర్త పోయాక సంసార బాధ్యతలు పార్వతమ్మపై పడ్డాయి. జయకాక ఆమెకి మరో అమ్మాయి, అబ్బాయి వున్నారు. కంపెనీ వారిచ్చిన కొద్దిపాటి డబ్బు బ్యాంకులో వేసి, తన రెక్కల కష్టంపైనే ఆధారపడిందామె. మిషను కుట్టి, ఆ వచ్చే డబ్బుల్తోనే పిల్లల్ని చదివిస్తోంది. భర్త పోయినా, నలుగురిలో మంచిగా వుండి, ఒకరిచేత వేలెత్తి చూపించకుండా వుండే ఆమె వ్యక్తిత్వం వల్ల నాకు ఎనలేని గౌరవం.

జయ పదవతరగతి పాసవగానే చదువు ఆపివేసింది. పెళ్లి చేసెయ్యాలనే తలంపుతో సంబంధాలు వెదకడం ప్రారంభించింది.

"నీ ఎరికలో ఏదయినా సంబంధముంటే చూడు బాబూ" అని నాకు కూడా చెప్పింది.

"సరే! అలాగే చూద్దాం" అన్నాను.

అప్పట్నుంచీ జయ కోసం సంబంధాలు చూస్తున్నాం. చాలా మందికి పిల్ల నచ్చినా, పార్వతమ్మ యిచ్చే కట్నం నచ్చలేదు.

కట్నాల మార్కెట్టులో పెళ్లి కొడుకుల గిరాకీ బాగా పెరిగిపోతున్న ఈ రోజుల్లో పార్వతమ్మ యిచ్చే అయిదువేలు ఏ మూలకి? అంత సొమ్ముకి ఒక చిన్న చిరుద్యోగి అయినా రాడే! యిద్దరు ముగ్గురు కనీసం ఏడెనిమిది వేలయినా యివ్వందే బేరం కుదరదని ఖచ్చితంగా చెప్పేసారు. బ్యాంకులో దాచిన అంతడబ్బూ ఈ ఒక్క పిల్లమీదే ఖర్చు చేసేస్తే, యిక మిగతా యిద్దరి పిల్లల గతి? ఎటూ నిర్ణయించుకోలేని పరిస్థితుల్లో కాలం మరికొంత ముందుకు సాగింది. గత రెండేళ్ల కంటే యిప్పుడు మరీ ధరలు పెరిగాయి.

పార్వతమ్మ మనోవేదన మరింతగా పెరిగింది. జయ తర్వాత పిల్ల—అన్నపూర్ణ రజస్వల అయింది. రవి ఏడవతరగతి కొచ్చాడు.

"ఎప్పటికయినా జయ నెత్తిమీద నాలుగక్షింతలు వేయగలనా బాబూ! అప్పుడే అన్నపూర్ణ కూడా అందొచ్చేస్తోంది" అంటూ నా దగ్గర వాపోసాగింది.

నేను, మా ఆవిడ మాకు తోచిన విధంగా ఓదార్చాం.

ఆదర్శాలు వల్లించడం తేలికే. కానీ వాటిని ఆచరణలో పెట్టవలసి వచ్చినప్పుడే, వ్యక్తుల నిజ స్వరూపాలు బయటపడతాయి. ఇంకొకరు ఆదర్శవంతంగా వ్యవహరించాలని ఆశించినప్పుడు, 'మనం ఆ విధంగా వున్నామా?' అని ప్రతి వ్యక్తీ ప్రశ్నించుకుంటే, సమాజంలో చాలా సమస్యలకు పరిష్కారం లభించినట్లే!

కాని, మా ఓదార్పులకి ఆ కన్నతల్లి గుండె మంటలారేనా?

* * *

పొలం వ్యవహారాలు చూడడానికి మా వూరు పాతపట్నం వెళ్లాల్సి వచ్చింది. పనులన్నీ చక్కదిద్దుకునే సరికి ఓ నాలుగు దినాలు పట్టింది.

తిరిగ్గా సాయంత్రం అమ్మవారి గుడివైపు వెళ్లాను. 'నీలమణిదుర్గ' అంటే ఆ వూరి వాళ్లకే గాక, ఆ చుట్టుప్రక్కల వూరివాళ్లకి కూడా ఎంతో గురి, నమ్మకం.

అర్చకుల పలకరింపుల మధ్య దర్శనం చేసుకుని బయటికి వచ్చాను.

అంతలో కనిపించాడు ప్రకాశం. వాళ్ల నాన్న నాకు పరిచయస్థుడు. అతనెప్పుడో యిరవైఏళ్ల క్రితం పశ్చిమ బెంగాల్ వెళ్లిపోయి, అక్కడే ఏదో జూట్ మిల్లులో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రకాశం కూడా తండ్రిలాగే మిల్లులో పనిచేస్తున్నాడు.



పలకరింపులయ్యాక యిద్దరం ఊరి వైపుగా నడక సాగించాం.

"వుంటావా రెండు రోజులు?" అడిగాను.

"పొలం పనులు యింకా పూర్తవ్వలేదు మామయ్యా! యింకా ఓ వారం దినాలు పడుతుందేమో!"

"ఏంటోయ్! మీ నాన్న నీకు మరి పెళ్లి చెయ్యడా?





లేక కట్నాలమీద ఆశా?" అన్నాను హాస్యంగా.

"అదేంలేదు మామయ్యా! చూస్తున్నారు. ఏదీ కుదరడం లేదు" అంటూ నసిగాడు.

ప్రకాశాన్ని పరిశీలనగా చూసాను. కలకత్తా వంటి మహానగరంలో తిరుగుతున్నందువల్లనేమో, చదువంత గా లేకపోయినా, మనిషి స్టైల్‌గా వున్నాడు. ఏదో సంపాది స్తున్నాడు. నాకు తెలిసినంతవరకూ ప్రకాశం బుద్ధి మంతుడే.

ఒక్కసారి జయ నా కళ్లముందు కదిలింది.

"మీ నాన్న నీ మీద ఎంత సంపాదించుకోవాలంటు న్నారు?" నవ్వుతూ అడిగాను.

"నాకలాంటివి నచ్చవు మామయ్యా! మా నాన్నకీ అంత పట్టింపు లేదు. అమ్మాయి మనకి అనుకూలంగా వుంటే చాలు."

మెల్లగా జయ విషయం అతనిముందు కదిపాను.

"నా కంటే ఆ అమ్మాయి చదువు ఎక్కువ గదా!" అన్నాడు అనుమానంగా.

"అలాంటి వేం మనసులో పెట్టుకోకోయ్! రేపొకసారి నాతో శ్రీకాకుళం వచ్చి అమ్మాయిని చూడు. తర్వాత కలకత్తా వెళ్లి మీ నాన్నగారి అభిప్రాయం వ్రాయి. చూసినంత మాత్రాన తప్పేం లేదుగా" అతన్ని వదిలె య్యాలనిపించలేదు నాకు.

ప్రకాశం నాతో రావడానికి ఒప్పుకున్నాడు.

మర్నాడు ఉదయమే మందసా బస్సులో శ్రీకాకుళం వచ్చాం.

ఆ మధ్యాహ్నం జయని మా యింట్లోనే అతనికి చూపించడం జరిగింది. ప్రకాశానికి జయ నచ్చింది. యిక పార్వతమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎలాగైనా యిది ఖాయమయ్యేట్టు చూడమని నాతో అంది.

నాకు కూడా—ఈ పెళ్లి జరిగితే జయ చాలా అదృష్టవంతురాలనిపించింది. మా ఆవిడ కూడా యిదే అభిప్రాయం వ్యక్తం చేసింది.

జయ విషయం సరేసరి.

"ఏమ్మా! నీ కిష్టమేనా" అంటే సిగ్గుల మొగ్గ అయి, అక్కడ నుండి పారిపోయింది.

ఆ రోజు వుండి ప్రకాశం మర్నాడు పాతపట్నం వెళ్లిపోయాడు

* * *

ప్రకాశం వెళ్లి అప్పుడే దాదాపు నెలకావస్తోంది. వాళ్ల నాన్న దగ్గర్నుండి నాకింకా వుత్తరం అందలేదు. ఈ లోపల పార్వతమ్మ వుత్తరం గురించి చాలాసార్లు అడి గింది. ఏదో చెప్పి దాటేసేవాడిని. రోజులు గడిచేకొలదీ నాకూ ఏదో అనుమానం వేసింది. పైకి ఏమీ అనలేదు గాని, లోలోపల బాధపడేవాడ్ని. పాపం పార్వతమ్మని చూస్తే జాలనిపించేది.

'ఆడపిల్లలు తల్లిదండ్రుల గుండెల మీద కుంపటి' అని ఎందుకంటారో పార్వతమ్మని చూస్తే తెలిసింది.

మరింక ఉండబట్టలేక ప్రకాశం నాన్నపేర వుత్తరం వ్రాసాను. దానికి వెంటనే జవాబు వచ్చింది.

ఆనందరావ్,

ప్రకాశం చెప్పిన సంగతి విని, నీకెలా సమాధానం వ్రాస్తే బాగుంటుందా అని ఆలోచించేంతలో నీ వుత్తరం అందింది. ప్రకాశం యువకుడు. వేడి రక్తం కలవాడు. నేను కూడా వాడి వయసులో వున్నప్పుడు యిలాంటివే చాలా చాలా అన్నాను. కాని, మా నాన్న వాటిని సాగనివ్వలేదు. అలా ఆయన సాగనివ్వక పోవడమే మంచిదయింది. ఆ నాడు నేను వల్లించిన పాఠాలు ఈనాడు నా కొడుకు వల్లిస్తున్నాడు. మరి ఈనాడు తండ్రిగా నా బాధ్యత నిర్వహించాలి గదా! ప్రకాశం చెప్పాడు—అమ్మాయి అందంగా వుంటుందని. కాని అందముంటే చాలా? సుఖంగా వుండడానికి డబ్బు కావద్దూ! మా ప్రకాశానికి పదివేలు యిస్తామని యిక్కడ కొన్ని సంబంధాలు వస్తున్నాయి. అందులో ఏదో ఒకటి సెటిల్ చేసెయ్యాలనుకుంటున్నాను. ఏమయినా పదివే లు యిస్తారేమో కనుక్కో.

యిక వుంటాను. చెల్లెమ్మకి, పిల్లలికి దీవెనలు.

ఇట్లు
రమణమూర్తి

వుత్తరం చదివిన నాకు కోపం ముంచుకు రాసాగింది.

'ఈ వుత్తరానికేనా నేను యిన్నాళ్లూ ఎదురుచూ సింది! యింత సోది వ్రాసి, 'సుత్తి' కొట్టేకన్నా ఒక్కమా టలో 'మాకీ సంబంధం యిష్టం లేదని' రాయవచ్చు కదా. ఈ రోజుల్లో ప్రతివారికీ ఫాషన్ అయిపో యింది—మా అబ్బాయికి పదివేలిస్తామన్నారనో, పాతిక వేలిస్తామన్నారనో—ఛ ఛ ఈ దేశం యిలా తగలబడిపో తుందేం? 'వరకట్నం నిషేధించాలి' అని అరిస్తే చాలా? మనుషుల్లో పరివర్తన రాదా? ఏం మనుషులు వీళ్లు? ఒక్కరూ వాస్తవాన్ని గుర్తించరేం?'

ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. కసిగా ఓ మూలకి విసిరేసిన వుత్తరాన్ని మా ఆవిడ వచ్చి అందు కుంది. చదివి ఆమె కూడా బాధ పడింది.

తప్పు చేసినట్టు యిద్దరు మౌనంగా వుండిపోయాం.

"ఈ రోజయినా వుత్తరం వచ్చిందా బాబూ" అంటూ వచ్చి గుమ్మంలో చతికిలబడింది పార్వతమ్మ.

ఆ కళ్లలో ఎన్ని ఆశలు! నేను చెప్పిన విషయం వింటే ఆ ఆశలన్నీ నీరుగారిపోతాయి గాబోలు. అయినా నరే చెప్పకతప్పదు.

చెప్పకుండా దాచి, ఆవిడని మభ్య పెట్టలేను. నన్ను నేను వంచించుకోలేను.

విషయం విన్న తర్వాత పార్వతమ్మ ముఖం చిన్నబో యింది. కళ్లు నీటిమడుగులే అయ్యాయి.

"పోనీలే నాయనా! ఎవరికేది ప్రాప్తమో! ఆ సర్వేశ్వరు డు మా జయ నుదుట ఎలా వ్రాసాడో! ఖర్మనెవరు తప్పించగలరు!" అంటూ కళ్లొత్తుకుందావిడ.

వేదనలో వేదాంతం చెప్పుకోవడం కంటే చేసేదే ముంది?

"మరేం కంగారు పడకమ్మా! జయకేం! బంగారు

బొమ్మ. పెళ్ళికాదన్న దిగులేం వద్దు. కల్యాణ ఘడియ వస్తే పెళ్ళికొడుకే మనదగ్గరకి వెదుక్కుని వస్తాడు" ఏవో నాకు తోచిన సానుభూతి వాక్యాలు పలికాను.

* * *

ఇది జరిగిన ఓ నాలుగు నెలల తర్వాత— అనుకోని విధంగా, నాకు అత్యంత ఆశ్చర్యం కలిగించేటట్టుగా జయలక్ష్మికి పెళ్ళి నిశ్చయమయింది. అబ్బాయిది విశాఖపట్నం. బి.కాం. వరకూ చదివి—విశాఖ పోర్ట్‌లో వుద్యోగం చేస్తున్నాడు. నెలకు దాదాపు రెండువేల వరకూ జీతం తెచ్చుకుంటున్నాడు. చెంగల్రావు పేటలో సొంత యిల్లు కూడా వుంది. పైగా అందంగా వుండి, జయకి ఈడూ, జోడూ సరిపోయినట్టుగా వున్నాడు.

కట్నం కోరలేదు. ఒక్కడే కొడుకు కావడం మూలాన, అతనిష్టప్రకారంగానే వాళ్ళ పెద్దవాళ్ళు వచ్చి, ముహూర్తం నిర్ణయించుకుని వెళ్ళారు.

యింకా నెల రోజులే వుంది జయ పెళ్ళి.

పెళ్ళికూతురి తరఫున పెద్దమనిషిగా నేను వ్యవహరించక తప్పలేదు.

యిన్నాళ్ళకి జయకి సంబంధం స్థిరపడడం, అందునా... యిలాంటి మంచి సంబంధం... నాకు అమితానందాన్నే కలిగించింది. ఎందుకో నాకు ఆక్షణంలో రమణమూర్తి జ్ఞాపకమొచ్చాడు. 'పూర్ ఫెలో'... తాను వద్దనేస్తే, యిక ఈ అమ్మాయికి పెళ్ళి కాదనుకున్నాడేమో! ప్రకాశాన్ని పెళ్ళాడితే జయ ఏం అనుభవించేది? చాలీచాలని జీతం, అప్పులు, రోగాలు, యిరుకు మురికి జీవితం! అంతే కదా! మరి ఇప్పుడో... దర్జాగా ఒక ఆఫీసరు భార్యగా, హోదాతో... ఓహో! ఎంత అదృష్టవంతురాలు!... తనకంటే ఎంతో ఉన్నతుడయినవాడు జయలక్ష్మిని కానీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటున్నాడు—అని తెలిస్తే, ప్రకాశరావు, అతని తండ్రి ఎలా ఫీలవుతారు! గుండెలు బాదుకుంటారా? పగతో మండిపోతారా? అవమానంతో క్రుంగిపోతారా? లేక... పోనీలే... ఎలాగయితేనేం అమ్మాయికి పెళ్ళి కుదిరింది—అని ఆనందిస్తారా? ఏమో!

వాళ్ళకి తెలియజేయాలనే నిర్ణయించుకున్నాను. వుత్తరం వ్రాయడానికి ఉపక్రమించాను. కానీ, తీరా వుత్తరం మొదలు పెట్టేసరికి గాని గుర్తు రాలేదు—ఏమని వ్రాయాలో... చాలాసేపు ఆలోచించాను. కానీ, కలం ముందుకుసాగలేదు.

కానీ... ఎలాగయినా ఈ సంగతి వాళ్ళకి తెలియజేయాలనే పట్టుదల... తపన... ఏదో తెలియని కసి...

మర్నాటికి, వుత్తరం వ్రాయడం వాయిదా వేసి నిశ్శబ్దంగా కళ్ళు మూసుకున్నాను.

* * *

ఆ తర్వాత కూడా రమణమూర్తికి వుత్తరం వ్రాయడం కుదరలేదు. అటు బ్యాంకులో పని ఒత్తిడి, యిటు యింట్లో చికాకులు, మధ్య మధ్య పార్వతమ్మ నాతో జరిపే సలహా సంప్రదింపులు. ఇక క్షణం తీరిక దొరకక, ఆ వుత్తరం సంగతే మర్చిపోయాను.

జయలక్ష్మి పెళ్ళిరోజు వచ్చింది.

అంతా కలసి విశాఖ తరలి వెళ్ళాం. మగ పెళ్ళివారు ఏర్పాట్లు బాగా జరిపిస్తున్నారు.

పెళ్ళి కళతో 'వాసవీ కల్యాణ మంటపం' వైభవంగా వుంది.

ఓ ప్రక్క మైక్‌లో సినిమా పాటలు... మరోప్రక్క బ్యాండ్ మేళం... పిల్లల కేకలు, పెద్దల అరుపులు... అంతా కోలాహలంగా వుంది.

వీటన్నిటినీ గమనిస్తూ ఓమూల కుర్చీలో మౌనంగా కూర్చున్నాను. మా ఆవిడ ఎక్కడ యిరుక్కుపోయిందో గాని... కనిపించలేదు.

అంతలో కనిపించిందామె... ఆమె ఆమేనా అని పరీక్షగా చూసాను. ఎవరితోనో మాట్లాడుతోంది. నవ్వుతున్నప్పుడు సొట్టలువడ్డ ఆ బుగ్గలు, అందమైన పెద్దకళ్ళు... ఆమే అని స్పష్టంగా చెబుతున్నాయి.

వయసు తెచ్చిన ఏవో కొద్దిమార్పులు తప్ప... నా కంటికి పదిహేనేళ్ల క్రితం నాటి మాలతిలా కనిపించింది.

యింతలో ఎవరో పిలిస్తే లోపలికి వెళ్ళిపోయింది.

మాలతి యిక్కడెందుకుంది? అసలు వీళ్ళకీ, మాలతికి సంబంధమేమిటి? ఎన్నో ప్రశ్నలు... సందేహాలు...

గతం కళ్ళముందు ఒక్కసారి కదలాడింది.

మా నాన్నగారు ఉద్యోగరీత్యా విజయనగరంలో వుండేటప్పుడు మా యింటికి నాలుగిళ్ళ అవతల మాలతి వాళ్ళుండేవారు. మాలతి తండ్రి మామూలు బడిపంతులు. అప్పటికి ఆమె కాలేజీలో బియ్యే చదువుతుండేది. అందంగా, వాడని మల్లెలా వుండే ఆమె అంటే అబ్బాయిలకదో ఆకర్షణ...

ఎం.కాం. చదివి—బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న నాపై ఆడపిల్లల తల్లిదండ్రుల చూపులన్నీ వుండేవి. కాని, నా చూపులన్నీ మాలతి మీదే వుండేవి.

ఆమెని నా స్వంతం చేసుకోవాలనే కోరిక... ఏదో తెలియని తపన... నాలో ఆవేశం ఉప్పెనలా... పొంగేది.

కాని... బయటకి చెప్పుకోలేని నిస్సహాయత... కారణం—మా నాన్నగారి మాటకి ఎదురు చెప్పే సాహసం నాకు చిన్నప్పట్నుంచీ లేదు. ఆయనంటే చెప్పలేనంత భయం...

మాలతి అప్పుడప్పుడు మా చెల్లెలి కోసం మా యింటికి వచ్చేది. నేను ఆమెను చూసేటప్పుడు నా వంక చూడడానికి సిగ్గుపడేది. అదో అనుభూతి కలిగించేది నాకు. క్రమంగా నా హృదయంలో మాలతి తిష్టవేసింది. కాని, ఏం చేయను? మౌనంగా, ఆమె అందాన్ని ఆరాధించడం తప్ప...!

ఒకరోజు మా అమ్మా నాన్నా మాట్లాడుకుంటుండగా విన్నాను.

'రాఘవరావు మాష్టారు భలే ఎత్తు మీద వున్నట్టున్నారు. చవకలో అల్లుణ్ని తెచ్చేసుకోవాలని తాపత్రయం' అంటోంది అమ్మ.

"మనవాడికి తక్కువేమయిందే. బ్యాంకులో వుద్యోగం—యిరవైవేలకి ఎవరూ తక్కువివ్వరు. అలా కాక ఏమీ యివ్వలేని ఈ ముష్టి సంబంధం చేసుకోవడానికి...మనం కూడా వాళ్ళలాంటి వాళ్ళమనే అనుకుంటున్నాడా ఆ రాఘవరావు? లేకపోతే వాళ్ళమ్మాయి అందాన్ని ఎర చూపించాలనుకుంటున్నాడా?" కోపంగా వినిపించింది నాన్న గొంతు.

నా ఆశాసౌధాన్ని ఎవరో క్రూరంగా పడదోసి, నన్ను ఆ పునాదుల్లోనే సమాధి చేసేసిన అనుభూతి కలిగిందా క్షణంలో.

మా యింటికి రావడం మానేసింది మాలతి.

కొన్నాళ్ళకి వాళ్ళ నాన్నగార్కి ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోయారు.

కాలచక్రంలో కొన్ని సంవత్సరాలు దొర్లాయి. మాలతి జ్ఞాపకాలు క్రమంగా నా నుండి దూరమవుతున్నాయి.

నాన్న అనుకున్నట్టుగానే యిరవైవేల కట్నానికి, మా కల్యాణికి లభించిన వేయినూటపదహార్ల ఆడపడుచు లాంఛనాలకి నేను అమ్ముడుపోయాను.

శాంత నా యిల్లాలయింది. నిజంగా శాంతస్వభావం గలది. అన్యోన్యంగానే వుంది మా సంసారం. మరీ తల మునకలయ్యేంత సమస్యలు లేవు. ఉద్యోగంలో ఓ మెట్టు పైకి వచ్చాను.

సుఖంగా జరుగుతోంది కాలం.

మళ్ళీ యిన్నాళ్ళకి మాలతిని యిలా... యిక్కడ చూడడం!

మగపెళ్ళి వాళ్ళకి, మాలతికి ఏమయినా బంధుత్వముందా...?

పెళ్ళి చేసుకుందా?... చేసుకుంటే ఆ అదృష్టవంతుడెవరో...?

అసలు తగినంత కట్నం యివ్వలేక పెళ్ళి కాలేదేమో!

ఏదో ఒక వుద్యోగం చేసుకుంటూ, ఒంటరిగా వుంటోందేమో! ఈ భావన రాగానే నా మనసు ఆమెపట్ల సానుభూతితో నిండిపోయింది. ఎలా అయినా ఆమెని పలకరించాలి...

ఆమె కోసం ఎదురుచూడసాగాను.

అంతలో పెళ్ళికొడుకు వచ్చాడు. వెంట మాలతి, మరోవ్యక్తి వున్నారు. ఆ వ్యక్తి ఫుల్‌సూట్‌లో హుందాగా వున్నాడు.

"ఆనందరావుగారూ! ఈయన మా మామయ్యగారు.

బొంబాయి నుండి రాత్రే వచ్చారు. అక్కడే చీఫ్ యింజనీర్‌గా వుంటున్నారు."

యిద్దరం కరచాలనం చేసుకున్నాం.

"యిక ఈమె మా అత్తయ్యగారు. బొంబేలోనే ప్రొఫెసరుగా వుంటున్నారు."

ఆశ్చర్యంగా నా కళ్లు వెడల్పయ్యాయి. మాలతి ఎంత అదృష్టవంతురాలు? పెద్ద యింజనీర్ భార్య...పైగా ప్రొఫెసర్... నాకు కళ్లు తిరిగినట్టయింది. నమ్మనట్టు ఆమెవంక చూసాను. మాలతి నిండుగా చిన్నగా నవ్వింది.

"అదేమిటండీ అలా చూస్తారు? మా అత్తయ్యకి మొదట్నుంచీ సింపుల్‌గా వుండడమంటేనే యిష్టం. అందుకే మా మామయ్య యాభైవేల కట్నాన్ని కూడా కాదని ఆమెని పెళ్లి చేసుకున్నారు."

"చాల్లే సురేష్! మాటలు బాగా నేర్చావ్" కసురుకుంది ముద్దుగా. మాలతి భర్త, సురేష్ యిద్దరు గట్టిగా నవ్వేసారు. నేను కూడా నవ్వేసాను. కాని, నాలో ఏదో తెలియని ఆవేదన—! తర్వాత సురేష్, మాలతి భర్త ఏదో పని మీద లోనికివెళ్ళిపోయారు. నేనూ, మాలతి, మిగిలాం... మా యిద్దరి మధ్యా మౌనం... కొంతసేపు పోయాక నేనే మాట్లాడాను.

"బాగున్నావా మాలతీ!"

"అయితే జ్ఞాపకమున్నానన్నమాట. యింతసేపూ నన్ను గుర్తుపట్టలేదేమోనని అనుకున్నాను" అంది నా నవ్వుకి శ్రుతి కలుపుతూ.

"సరిపోయింది. నేను కూడా సరిగ్గా అలాగే అనుకున్నాను."

తర్వాత మేం చాలాసేపు ఒకరి కుటుంబం గురించి యింకొకరం తెలుసుకున్నాం.

అలా ఆమెతో మాట్లాడుతోంటే నా కనిపించింది—నిజంగానే పెళ్లిళ్లు స్వర్గంలోనే నిర్ణయించబడతాయని.

ఒక వేళ నన్ను పెళ్లాడినట్లయితే మాలతి ప్రస్తుతం నా భార్యలాగే వంటింటి జీవితం గడిపేది. యిప్పుడో... ఆవిడ జీవితమే వేరు.

తమ అహంకార పూరితమయిన తళుకుబెళుకులతో, మధ్యతరగతి ఆడపిల్లల సుకుమార, సున్నిత హృదయాల్లో ఆశలురేపి, అవి తీరుతాయని ఆ కన్నెపిల్లలు తీయని కలలుకనే సమయంలో, వాటిని కసిదీరా నేలరాల్చే మగ మహారాజుల మధ్య, అర్ధాంగిగా ఆమెనే స్వచ్ఛంగా స్వీకరించి, ఆమె కన్నీటిని తుడవగలిగే సహృదయులు కూడా వుంటారని, నాకిప్పుడే తెలిసింది.


ఆకాశం ఎంత ఉరిమి, యింకెంత కురిసినా, తన రాకతో భూమాతని పులకరింపచేస్తుంది స్వాతిజల్లు.

జయలక్ష్మి పెళ్లి గురించి ఆడంబరంగా రమణమూర్తికి వ్రాయాలనుకున్న ఉత్తరం గురించి ఆలోచన నా మనసు నుండి తొలగించివేసాను. □

బహుమతి పొందిన చిట్టికథ

# పోటీ

— ఇల్లిందల సుందరీకృష్ణ



అప్పారావు, సుబ్బారావు ప్రాణస్నేహితులు. ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఇద్దరూ వివాహితులే. ఒకే కాలనీలో పక్క పక్క యిళ్ళలో అద్దెకుంటున్నారిరువురూ. అప్పారావు భార్య జయ. సుబ్బారావు భార్య విమల. మొదట్లో రెండుజంటలూ బాగా కలిసిపోయారు. కాని రాను రాను వాళ్ళు కొన్ని యిబ్బందులకు గురి అయ్యారు. విమల, జయ పైకి కలిసిపోయినట్లు కనిపించినా యిద్దరికీ ఒకరంటే ఒకరికి అసూయ. విమల ఏ చీరకొన్నా జయదానికి ఎన్నో వంకలు పెట్టేది. వెంటనే అంతకన్నా ఎక్కువ ఖరీదు పెట్టి చీర కొనాల్సిందే. జయ ఏ వస్తువుకొన్నా దానికి నాణ్యత తక్కువని తను కొన్న ధర ఎక్కువపెట్టి కొన్న పెద్ద సైజుది కొనవల్సిందే. టి.వి దగ్గరనుంచి స్టీలు చెంబువరకూ పోటీయే యిద్దరికీ. వంటా వార్పుల విషయమే కాదు. ఆఖరికి యింటిముందు ముగ్గు వేయడం దగ్గరనుంచీ తనే అధికురాలిననే గర్వం యిద్దరిలో ఉండేది. ఆ గర్వం, ఆ అహం యిద్దరూ ప్రతిమాటలోనూ వ్యక్తం చేసేవారు. ఒక్కోసారి గంటల తరబడి వాదించుకొనేవారు. భర్తల జోక్యంతో మళ్ళీ మామూలుగా అయ్యేవారు. వీళ్ళ పిచ్చిపోటీ ఎక్కడిదాకా పోయిందంటే, ఒకరి కన్నా ఒకరు ఎక్కువ నగలు చేయించుకోవాలని భర్తలని వేధించడం మొదలు పెట్టారు. ఆఖరికి వారి సంసారాల్లో కీచులాటలు ప్రారంభమయ్యాయి. అడపాదడపా విమలా జయలు పోట్లాడుకొనేవారు.

అప్పారావుకు సుబ్బారావుకు మనశ్శాంతి లేకుండా పోయింది. ముఖ్యంగా వారిద్దరి స్నేహం ఎక్కడచెడుతుందోనని బెంగపెట్టుకున్నారు. పరిష్కార మార్గం వెతుక్కోసాగారు. అప్పారావు సుబ్బారావు ఆఫీసులకు శెలవులు పెట్టుకున్నారు వారం రోజులు. కారణాలు చెప్పకుండా వారం రోజులు సుభావంగా గడిపారు. శెలవులోనే అప్పారావు నెలాఖరునాడు భార్యతో రాత్రి తమ సామానంతా సర్దేసి వుంచమన్నాడు. యిల్లు ఖాళీచేస్తున్నట్లు కూడా చెప్పాడు. సామానంతా సర్దేసి పాక్ చేసి రెడీగా వుంచారు. చీకటితోనే లేచి, లారీ తెచ్చి సామాను లారీలో పెట్టించాడు. బయలుదేరేముందు సుబ్బారావుకి చెపుదామనుకున్నాడు. ఇంటికి తాళం వేసుంది. రాత్రి వాళ్ళు వాళ్ళ అత్తగారింటికి భోజనానికి వెళ్లినట్లు తెల్లారేక వస్తారని భార్య చెప్పింది. పోనీలే యిదీ మంచిదే తను యిల్లు మారుతున్న సంగతి రహస్యంగా వుంచాలనే కోరిక తీరింది. కొత్తయింట్లో దిగి సామానంతా సర్దుకున్నారు. సాయంత్రం తీరుబడిగా యింటి ముందర కుర్చీలో పేపరు చదువుతున్న అప్పారావు—లారీ ఆగిన శబ్దానికి తలెత్తి చూశాడు. కొయ్యబారిపోయాడు. పక్కవాటాలోకి సామాను దింపిస్తున్నాడు సుబ్బారావు.

ఇద్దరు గొప్పవాళ్ళవే కాదు ఇద్దరు మూర్ఖుల అభిప్రాయాలు కూడా ఒక్కలాగే వుంటాయిట! □